
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
జయశంకర్ భూపాలపల్లి 5 ములుగు
బుధవారం 17 జూలై 2024

సమధర్మం, త్యాగానికి ప్రతీక
మొహర్రం
నేడు పీర్ల పండుగ
వివరాలు 7వ పేజీలో..
నేడు తొలి ఏకాదశి
ఆలయాల్లో ప్రత్యేక పూజలు

అర్హత లేకున్నా వైద్యం!



- భూపాలపల్లి జిల్లాలో ఆగని ప్రైవేటు ఆస్పత్రుల ఆగడాలు
- విచ్చలవిడిగా క్లినిక్‌లు, నర్సింగ్‌హోంలు
- నిబంధనలు అతిక్రమిస్తున్న ఆర్‌ఎంపీలు
- టీజీఎంసీ తనిఖీల్లో వెలుగు చూసిన వాస్తవాలు
- అయినా చర్యలు తీసుకోని వైద్య ఆరోగ్య శాఖ

భూపాలపల్లి కలెక్టరేట్, జూలై 16: వైద్య రంగంలో ఎన్ని అధునాతన సేవలు అందుబాటులోకి వస్తున్నా క్షేత్రస్థాయిలో అవి రోగులకు సరిగా అందడం లేదు. సర్కారు దవాఖానల్లో వైద్యం ఇప్పటికీ అందని ద్రాక్షలా మారిందనే ఆరోపణలు వస్తున్నాయి. దీంతో కొన్ని ప్రైవేటు ఆస్పత్రులకు కాసుల పంట పండుతోంది. ఎలాంటి అర్హత లేకున్నా భూపాలపల్లి జిల్లాలో కొందరు డాక్టర్లుగా చెప్పుకుంటూ క్లినిక్కులు నిర్వహిస్తున్నారు. మరికొందరు ఒక వైద్య విధానంలో అర్హత ఉండి మరో వైద్య పద్ధతుల్లో చికిత్సలు చేస్తున్నారు. తెలంగాణ మెడికల్ కౌన్సిల్ (టీజీఎంసీ) ఇటీవల చేపట్టిన తనిఖీల్లో ఇలాంటి ఆగడాలు వెలుగు చూశాయి. అయినా వైద్య శాఖ జిల్లా అధికారులు చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు.

భూపాలపల్లి జిల్లాలో మొత్తం 34 ప్రైవేటు ఆస్పత్రులున్నాయి. ఇందులో చాలా వరకు భూపాలపల్లి జిల్లా కేంద్రంలోనే నడుస్తున్నాయి. వీటిలో చాలా వరకు అర్హత లేని వైద్యులే కొనసాగుతున్నట్టు ఆరోపణలు ఉన్నాయి. బీఎంఎస్ అర్హత కలిగిన వైద్యులు అల్లోపతి చికిత్సలు చేయడం, ఆర్‌ఎంపీలు సైతం నర్సింగ్‌హోంలు నిర్వహించడం లాంటి ఘటనలు ఉన్నాయి. పలు చోట్ల ఎంబీబీఎస్ అర్హత కలిగిన డాక్టర్స్ సర్టిఫికెట్లతో ఆస్పత్రుల రిజిస్ట్రేషన్ చేయించి అర్హత లేని వారితో చికిత్సలు అందిస్తున్నట్టు తెలుస్తోంది. అయినా పట్టించుకొనే నాథుడే కరువయ్యాడు. అలాగే విదేశాల్లో ఎండీ అర్హత పొందినా ఆలిండియా మెడికల్ కౌన్సిల్ ఇక్కడ ఎంబీబీఎస్‌కు సత్సమానంగా పరిగణిస్తుంది. అయితే.. భూపాలపల్లిలో ఓ వైద్యుడు తన పేరు పక్కన 'ఎండీ' రాసుకున్నా చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. ఇలాంటి దుశ్చర్యలపై పలుమార్లు ఫిర్యాదులు వెళ్లినా వైద్య ఆరోగ్య శాఖ నిమ్మకు నీరెత్తినట్టే వ్యవహరిస్తోందనే ఆరోపణలు వస్తున్నాయి.

ఆర్‌ఎంపీలపై చర్యలేవి?

జిల్లాలో 500 మందికి పైగా ఆర్‌ఎంపీలు ప్రాక్టీస్ చేస్తున్నారు. నిబంధనల ప్రకారం ఆర్‌ఎంపీలు ప్రథమ చికిత్స మాత్రమే చేయాల్సి ఉంది. కానీ కొందరు నర్సింగ్ హోమ్‌లు సైతం నిర్వహిస్తున్నారు. భూపాలపల్లి, కాటారం, గణపురం మండల కేంద్రాల్లో కొందరు ఆర్‌ఎంపీలు సర్జరీలు కూడా చేస్తున్నట్టు తెలుస్తోంది. భూపాలపల్లి పట్టణంలోని కార్ల్‌మార్క్స్‌కాలనీకి చెందిన సింగరేణి రిటైర్డ్ కార్మికుడు మల్లేష్ నడుమునొప్పితో మే 23న కృష్ణకాలనీకి చెందిన ఆర్‌ఎంపీ వద్దకు వెళ్లాడు. ఆర్‌ఎంపీ ఆయనకు పెయిన్‌కిల్లర్ ఇంజక్షన్ వేశాడు. వేశాడు. తెల్లారి బాధితుడు అపస్మారక స్థితిలోకి వెళ్లడంతో కుటుంబసభ్యులు దగ్గరలోని ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించారు. వైద్యం అందించడంతో బాధితుడు సాధారణ స్థితికి వచ్చాడు. ఆర్‌ఎంపీ ఇంజక్షన్ వేయడం వల్లే తాను తీవ్ర అస్వస్థతకు గురయ్యానని మల్లేష్ ఆరోపిస్తున్నాడు. ఇలాంటి ఘటనలు జిల్లాలో రోజుకోచోట జరుగుతూనే ఉన్నాయి. అయినా వైద్య ఆరోగ్య శాఖ పట్టించుకోవడం లేదు.

వెలుగు చూసిన విస్తుబోయే నిజాలు

సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు నకిలీ డాక్టర్ల ఆటకట్టిం చేందుకు తెలంగాణ మెడికల్ కౌన్సిల్, ఆలిండియా మెడిక ల్ కౌన్సిల్ అధికారులు నేరుగా రంగం లోకి దిగారు. ఏప్రిల్ 25న తెలంగాణ మెడికల్ కౌన్సిల్ అధికారులు భూపాల పల్లి జిల్లాలోని ప్రైవేటు ఆస్పత్రులు, ఆర్‌ఎంపీలపై ఆకస్మిక దాడులు నిర్వహించగా విస్తుపోయే విషయాలు వెలుగులోకి వచ్చాయి. బీఎంఎస్ అర్హత కలిగిన వైద్యులు అల్లోపతి వైద్యం చేయ డాన్ని గుర్తించిన ఆ బృందం వారిపై కేసులు నమోదు చేసింది. భూపాలపల్లి అంబేద్కర్ కూడలి వద్ద నిర్వహిస్తున్న ఫార్మసీలో ఓ ఆర్‌ఎంపీ వైద్యుడు బెడ్స్ వేసి వైద్యం చేయడాన్ని గుర్తించా రు. వెంటనే అతగానిపై కేసు నమోదు చేశారు. మరోవైపు అధికారులు దాడులను తెలుసుకున్న కొందరు బీఎంఎస్ వైద్యులు, ఆర్‌ఎంపీలు ఆస్పత్రులకు తాళం వేసి అక్కడి నుంచి ఉడాయించారు.



నిబంధనలు పాటించకుంటే చర్యలు..

- డాక్టర్ మధుసూదన్, భూపాలపల్లి డీఎంహెచ్‌వో

నిబంధనలు పాటించని జిల్లాలోని ప్రైవేటు ఆస్పత్రులపై చర్యలు తీసుకుంటాం. అర్హత లేకుండా ఎవరూ వైద్యం చేయొద్దు. ఆర్‌ఎంపీలు ప్రభుత్వ నిబంధనలు అతిక్రమిస్తే సహించం. ఆర్‌ఎంపీలు ప్రథమ చికిత్సమాత్రమే చేయాల్సి ఉంది. అంతకు మించి వైద్యం చేస్తే కేసులు నమోదు చేస్తాం.



హైదరాబాద్‌లోని సచివాలయంలో వివిధ అంశాలపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మంగళవారం నిర్వహించిన సమీక్ష సమావేశానికి మంత్రి ధనసరి సీతక్క, ములుగు, భూపాలపల్లి కలెక్టర్లు దివాకర, రాహుల్ శర్మ, ఎస్పీలు శబరీశ్, కిరణ్ ఖరే హాజరయ్యారు.

గంజాయి విక్రేతల అరెస్టు

వెంకటాపురం పోలీసులకు చిక్కిన ఇద్దరు

వివరాలు 8వ పేజీలో..

పోడు భూములకు పట్టాలివ్వాలని ధర్నా



తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నాలో నాయకులు, పేదలు

వెంకటాపురం(నూగూరు), జూలై 16: పోడుభూములకు పట్టాలివ్వాలని డిమాండ్ చేస్తూ ఆదివాసీ నవ నిర్మాణసేన ఆధ్వర్యంలో నాయకులు, పేదలు మంగళవారం మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. ఈర్యాలీ కొమరంభీం విగ్రహం నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు కొనసాగింది. ఈసందర్భంగా తహసీల్దార్ కార్యాలయం ఎదుట బైఠాయించి ధర్నా చేశారు. అనంతరం ఆదివాసీ నవ నిర్మాణసేన రాష్ట్ర అధ్యక్షుడు కోర్సా నర్సింహమూర్తి మాట్లాడుతూ రామచంద్రాపురం గ్రామ సమీపంలోని 50ఎకరాల గ్రామకంఠం భూమిని రెవెన్యూ అధికారులు ఎలాంటి నిబంధనలు పాటించకుండా అటవీ శాఖకు బదలాయించారని ఆరోపించారు. పెసా గ్రామసభ నిర్వహించి మెజారిటీ సభ్యుల ఆమోదంతోనే బదలాయింపు జరగాలన్నారు. అటవీ శాఖ అధికారులు పోడు రైతులపై చేస్తున్న వేధింపులను మాను కోవాలని, పోడురైతులందరికీ హక్కుపత్రాలు అందించాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ వీరభద్రప్రసాద్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో జీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి పూనెం సాయి, ప్రతాప్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

మార్గదర్శకాల మేరకే బదిలీలు


అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు

భూపాలపల్లి కలెక్టరేట్, జూలై 16: ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు సీనియారిటీ ప్రాతిపదికన జిల్లా పరిధిలోకి వచ్చే పోస్టులకు కౌన్సెలింగ్ నిర్వహించి బదిలీలు చేయనున్నట్లు అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు తెలిపారు. కలెక్టరేట్ కార్యాలయంలో జరుగుతున్న జూనియర్ అసిస్టెంట్లు, టైపిస్టులు, కార్యాలయ సబార్డినేట్ల బదిలీలకు సంబంధించి కౌన్సెలింగ్‌ను ఆయన మంగళవారం పరిశీలించారు. జిల్లా పరిధిలోకి వచ్చే పోస్టులకు బదిలీలు చేయాల్సి ఉన్న దృష్ట్యా ఆయా శాఖల అధికారులు అందజేసిన జాబితా మేరకు ఒకేచోట నాలుగేళ్లు పనిచేస్తున్న సిబ్బందికి ఆప్షన్ మేరకు కోరుకున్న స్థానాలకు పారదర్శకంగా కౌన్సెలింగ్ జరుగుతోందన్నారు. మంగళవారం కౌన్సెలింగ్‌కు హాజరు కాని వారు ఈనెల 18న రావాలన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈవో విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

'మేడిగడ్డ' వద్ద నిలకడగా గోదావరి

41,200 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

మహదేవపూర్ రూరల్, జూలై 16 : కాళేశ్వరం ప్రాజెక్టులో ప్రధానమైన మేడిగడ్డ బ్యారేజీ వద్ద గోదావరి నది నిలకడగా ప్రవహిస్తోంది. ఎగువన కురుస్తున్న వర్షాలతో వారం రోజుల క్రితం వరద కాస్త పెరిగినప్పటికీ ప్రస్తుతం నిలకడగా కొనసాగుతోంది. మంగళవారం బ్యారేజీలోకి ఇన్‌ఫ్లో 41,200 క్యూసెక్కులు ఉండగా 85గేట్లను ఎత్తి వచ్చిన నీటిని వచ్చినట్లే దిగువకు పంపిస్తున్నారు.



సమ్మక్క సాగర్ బ్యారేజీ నుంచి దిగువకు వెళ్తున్న వరద నీళ్లు

'దేవాదుల'లో మరో మోటార్ షురూ...

కన్నాయిగూడెం: మండలంలోని గుట్టల గంగారం వద్ద ఉన్న జె.చొక్కారావు దేవాదుల ఎత్తిపోతల ప్రాజెక్టు నుంచి పంపింగ్‌ను ఆదివారం పునఃప్రారంభించిన అధికారులు మంగళవారం మరో మోటారును ఆన్ చేశారు. ఫేజ్-3లోని రెండు మోటార్ల ద్వారా 583 క్యూసెక్కుల నీటిని భీంఘనపూర్ రిజర్వాయర్‌కు ఎత్తి పోస్తున్నారు.

సమ్మక్కసాగర్‌లో..

తుపాకులగూడెం వద్ద ఉన్న సమ్మక్క సాగర్ బ్యారేజీలోకి వరద ప్రవాహం కొనసాగుతోంది. ఎగువన కురుస్తున్న వర్షాలకుతోడు మేడిగడ్డ, అన్నారం బ్యారేజీల నుంచి వస్తున్న ఇన్‌ఫ్లో, ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర సరిహద్దుల్లోంచి ప్రవహిస్తున్న ఇంద్రావతి నది వరద గోదావరిలో కలుస్తోంది. ఎగువ నుంచి 71,670 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండటంతో ప్రాజెక్టులోని 52 గేట్లు ఎత్తి 71,087 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. దేవాదుల ఇన్‌టేక్‌వెల్ వద్ద 74.10 మీటర్లు, బ్యారేజీ వద్ద 73.70 మీటర్ల నీటిమట్టం నమోదైంది.

సరస్వతీ బ్యారేజీ వద్ద కొనసాగుతున్న పరీక్షలు

మహదేవపూర్ : మండలంలోని అన్నారం వద్ద నిర్మించిన సరస్వతీ బ్యారేజీ వద్ద పరీక్షలు కొనసాగుతున్నాయి. ఆదివారం రాత్రి కురిసిన వర్షాలకు సోమవారం పరీక్షల కు ఆటంకం కలిగిన విషయం విదితమే. మంగళవారం వాతావరణం అనుకూలించడంతో డ్రిల్లింగ్ పనులు కొనసాయి. అయితే.. వరద ప్రవాహం కారణంగా పనులు ముందుకు సాగే పరిస్థితి లేకపోవడంతో పూణేకు చెందిన నిపుణుల బృందం తిరిగి వెళ్లేందుకు ప్రయత్నిస్తున్నట్లు తెలిసింది. ఇరిగేషన్ అధికారులు మాత్రం సాధ్యమైనన్ని పరీక్షలు చేసి వెళ్లాలని వాళ్లకు సూచిస్తున్నట్టు సమాచారం.

కాళేశ్వరంలో అరుణాచల అర్చకుల పూజలు



అరుణాచల ప్రధాన అర్చకులకు శేషవస్త్రాలు అందజేస్తున్న కాళేశ్వర అర్చకులు

మహదేవపూర్, జూలై 16: మండలంలోని పవిత్ర పుణ్యక్షేత్రమైన కాళేశ్వర, ముక్తీశ్వరస్వామిని తమిళనాడులోని అరుణాచల పుణ్యక్షేత్ర ప్రధాన అర్చకుడు కార్తికేయ శర్మతోపాటు పలువురు ఇతర అర్చకులు మంగళవారం దర్శించు కున్నారు. స్వామివారికి మహారుద్రాభిషేకం చేశారు. శుభానందాదేవి ఆలయం లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకుడు త్రిపురారి కృష్ణమూర్తి అరుణాచల ప్రధాన అర్చకుల బృందానికి శేషవస్త్రంతో సన్మానించి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

మునిసిపల్ ఆదాయం పెరగాలి



మునిసిపల్ సర్వసభ్య సమావేశం మాట్లాడతున్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

భూపాలపల్లిటౌన్, జూలై 16: భూపాలపల్లి మునిపాలిటీకి ఆదాయ మార్గాలను పెంచుకునే దిశగా ప్రజాప్రతినిధులు, అధికారులు దృష్టి సారించాలని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. మునిసిపల్ కార్యాలయంలో చైర్‌పర్సన్ సెగ్గం వెంకటరాణి అధ్యక్షతన మంగళవారం జరిగిన సాధారణ సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. మునిసిపల్ ఆస్తులకు సంబంధించి రెండు, మూడు రోజుల్లో నివేదికలను సమర్పించాలని అన్నారు. ఈ క్రమంలో పలువురు కౌన్సిలర్లు కూడా మునిసిపాలిటీ ఆస్తులు ఎక్కడెక్కడ ఉన్నాయని కమిషనర్ రాజేశ్వర్‌ను అడగ్గా ఆయన సమాధానం చెప్పలేకపోయారు. దీంతో కమిషనర్‌పై ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. మునిసిపాలిటీకి ఆస్తులు ఎక్కడెక్కడ ఉన్నాయో సమగ్ర నివేదికను తయారు చేయాలన్నారు. వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకుని విద్యుత్ శాఖ అధికారులు అప్రమత్తంగా ఉండాలని, ప్రమాదాలు జరగకుండా జాగ్రత్త చర్యలు తీసుకోవాలని సూచించారు. చెట్లు విరిగిపడటం, విద్యుత్ తీగలు తెగిపడే ప్రమాదాలపై దృష్టి సారించాలని అన్నారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని, ఈ క్రమంలో రోడ్ల వెంట చెత్తాచెదారాన్ని తీసివేసి, గుంతలుపడిన చోట మట్టితో నింపి నీటి నిల్వలు లేకుండా చేయాలని అన్నారు. డ్రెయినేజీలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. దోమల నివారణ కోసం ప్రతి కాలనీలో ఫాగింగ్ చేయాలన్నారు. అలాగే ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలపై ఉన్న బకాయిలను వెంటనే వసూలు చేసేందుకు చర్యలు చేపట్టాలని అన్నారు. పలువురు కౌన్సిలర్లు మాట్లాడుతూ పట్టణంలో దుకాణాలు నడుపుకునే వారు ట్రేడ్ లైసెన్సులు తీసుకునేలా చర్యలు చేపట్టాలని, లేదంటే మునిసిపల్ ఆదాయానికి గండిపడుతుందని కోరారు. దీనిపై ఎమ్మెల్యే స్పందిస్తూ ఈ అంశంపై అధికారులు దృష్టిసారించాలన్నారు. ఈ సమావేశంలో మునిసిపల్ తహీల్దార్ శ్రీనివాస్, మునిసిపల్ డీఈ శ్రీనాథ్‌రెడ్డి, వైస్ చైర్మన్ గండ్ర హరీశ్‌రెడ్డి, పలువురు కౌన్సిలర్లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

కోనోకార్పస్ చెట్లను తొలగించాలి..

భూపాలపల్లి పట్టణంలోని ప్రధాన రహదారిలో ఉన్న కోనోకార్పస్ చెట్లను వెంటనే తొలగించాలని మునిసిపల్ అధికారులనను ఎమ్మెల్యే గండ్ర సత్యనా రాయణరావు ఆదేశాలు జారీ చేశారు. 'పట్టణ ప్రజలకు మొక్కల బెంబేలు' శీర్షికన ఈనెల 6న 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనంపై ఆయన స్పం దించారు. కోనోకార్పస్ మొక్కలతో ప్రజలకు ప్రమాదం పొంచి ఉందని, వాటిని వెంటనే తొలగించేందుకు ఏర్పాట్లు చేయాలని మునిసిపల్ కమిషన ర్‌కు సూచించారు. అలాగే వాటి స్థానంలో మరో మొక్కలను నాటాలన్నారు.

భార్యను హత్య చేసిన భర్తకు జీవిత ఖైదు

వరంగల్ లీగల్, జూలై 16: భార్యపై అనుమానంతో వేధింపులకు గురి చేసి హత్యచేసిన నిందితుడికి యావజ్జీవ కారాగార శిక్ష, రూ.4 వేల జరిమానా విధిస్తూ వరంగల్ ప్రధాన సెషన్స్ జడ్జి బి. నిర్మలా గీతాంబ మంగళవారం తీర్పు వెలు వరించారు. అదే విధంగా భార్యను శారీరకంగా, మానసికంగా హింసించిన కేసులో మూడు సంవత్సరాల జైలు, రూ. వేయి జరిమానా విధించారు. కాగా ఈ రెండు శిక్ష లు ఏకకాలంలో అనుభవించాలని న్యాయమూర్తి తీర్పులో పేర్కొన్నారు.

వివరాలు ఇలా ఉన్నాయి. వరంగల్ జిల్లా రాయపర్తి మండలం బండకింది తం డాకు చెందిన భూక్యా గోపాల్ కూతురు రమను అదే మండలం జయరాం తం డాకు చెందిన లావుడ్యా శ్రీనుకు 20 సంవత్సరాల క్రితం ఇచ్చి వివాహం జరిపిం చారు. వీరికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. పెళ్లైన కొంత కాలానికి మద్యానికి బాని సై భార్యపై అనుమానంతో నిత్యం వేధిస్తుండేవాడు. పలుమార్లు పెద్దమనుషుల సమక్షంలో పంచాయితీలు నిర్వహించి నచ్చచెప్పారు. అయినప్పటికీ నిందితుడిలో మార్పు రాకపోవడంతో రమ 22ఏప్రిల్ 2016లో ఉమెన్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఇది ఇలా ఉండగా 1 జూలై 2016న ఆమెను నమ్మించి వ్యవసాయ భూమిలో పత్తి గింజలు పెట్టడానికి తీసుకెళ్లాడు. మర్నాడు అనగా 2 జూలై 2016న కూడా వ్యవసాయ పనులకు తీసుకెళ్లి పనుల అనంతరం ఇంటికి వచ్చారు. ఇం ట్లోనే గొడవ సృష్టించి ఆమెను విపరీతంగా కొట్టి కిరోసిన్ పోయగా ఆమె అరుస్తూ బయటకు పరుగులు తీసింది.

అయినప్పటికీ వెంటపడి అగ్గిపెట్టెతో నిప్పంటించగా గ్రామస్తులు చూసి మృతురాలి తల్లిదండ్రులకు సమాచారం అందించడంతో కాలిన గాయాలతో ఉన్న రమను ఆస్పత్రికి తరలించగా ఆమె చికిత్స పొందుతూ 5 జూలై 2016న మరణించింది. దీంతో నిందితుడు లావుడ్యా శ్రీనుపై పోలీసులకు ఫిర్యాదు చేయగా నిందితుడిపై కేసు నమోదు చేసి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. కేసు విచారణలో నేరం రుజువైనందున నిందితుడికి జీవిత ఖైదు, రూ. 4 వేల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు వెలువరించారు. కోర్టు పీసీ ఎ.సోమునాయక్ సాక్షులను ప్రవేశపెట్టగా ఏసీపీ ఎల్. ఆదినారాయణ, సీఐ సూర్యప్రకాష్ కేసు దర్యాప్తు చేశారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ సిరబోయిన శ్రీనివాస్ కేసు వాదించారు.

స్కానింగ్ సెంటర్ల తనిఖీ



స్కానింగ్ సెంటర్లను తనిఖీ చేస్తున్న రాష్ట్ర మానిటరింగ్ కమిటీ సభ్యులు డాక్టర్ జమునాదేవి, బిందుశ్రీ

వరంగల్ మెడికల్, జూలై 16 : రాష్ట్ర ఆరోగ్యకుటుంబ సంక్షేమశాఖ కమిషనర్ ఆదేశాల మేరకు మంగళవారం హనుమకొండలోని పలు స్కానింగ్ సెంటర్లలో రాష్ట్ర మానిటరింగ్ కమిటీ బృందం డాక్టర్లు జమునాదేవి, బిందుశ్రీ ఆకస్మిక తని ఖీ నిర్వహించారు. గర్భస్థ పిండ లింగ నిర్ధారణ నియంత్రణ చట్టం నియ మాలను పాటి స్తున్న తీరు, అనుమతి పత్రాలు, రికార్డుల నిర్వహణ తదితర అంశాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... లింగ నిర్ధారణ పరీక్షలు, భ్రూణ హత్యలు చట్టరీత్యా నిషేధమని ఇందుకు విరుద్ధంగా వ్యవహరించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. బాలికల నిష్పత్తి తగ్గుతున్న నేపథ్యంలో ఈ ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తున్నామని తనిఖీ విషయాలను కమిషనర్ కుటుంబ సంక్షేమశాఖకు అందజేస్తామని పేర్కొన్నారు. స్కానింగ్‌కు వచ్చిన గర్భిణులు, వారి సహాయకులతో మాట్లాడి వారు ఇచ్చిన వివరాలను నమోదు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో పీహెచ్ఎన్ మంగమ్మ, డీఈవో సందీప్‌లు పాల్గొన్నారు.

నాబార్డు ద్వారా రూ.460 కోట్ల రుణాలు

టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు



వర్క్‌షాపులో మాట్లాడుతున్న టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు

హనుమకొండ సిటీ, జూలై 16 : నాబార్డు ద్వారా ఉమ్మడి వరంగల్ జిల్లాలో వ్యవసాయ రైతు సేవా సహకార సంఘాలకు వివిధ వ్యాపారాల నిర్వహణ కోసం రూ.460 కోట్లు మంజూరు అయినట్లు టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు వెల్లడించారు. మంగళవారం హనుమకొండలోని డీసీసీ బ్యాంకులో కమర్షియల్, రీజినల్ రూరల్, జిల్లా సహకార కేంద్ర బ్యాంకుల జోనల్ వర్క్‌షాపు జరిగింది. ఈ సందర్భంగా రవీందర్‌రావు మాట్లాడారు. గోడౌన్లు, కోల్డ్ స్టోరేజీలు, పెట్రోల్ పంప్స్, రైస్ మిల్లులు తదితర వ్యాపారాలను సహకార సంఘాలు నిర్వహించుకొని తద్వారా ఆర్థికంగా బలోపేతం అయ్యేందుకు నాబార్డు రుణాలు మంజూరు చసినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాబార్డ్ జీయం ఉషా, సీఈవో వజీర్ సుల్తాన్, పౌల్ట్రీ ఫామ్స్ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే మార్తినేని ధర్మారావు పాల్గొన్నారు.

కేయూ కెమిస్ట్రీ విభాగంలో ప్రాంగణ నియామకాలు

కేయూక్యాంపస్, జూలై 16: కేయూ కెమిస్ట్రీ విభాగం నేతృత్వంలో హైదరాబాద్‌లోని జినోమ్ వ్యాలీ యూరోఫిన్స్ అడ్వినాస్ డిస్కవరీ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ప్రాంగణ నియామకాలు చేపట్టారు. ఈసందర్భగా కెమిస్ట్రీ విభాగాధిపతి ప్రొఫెసర్ టి. సవితాజ్యోత్స్న మాట్లాడుతూ..ఇంటర్వ్యూలకు 8 మంది ఎంపిక య్యారని వీరిలో ఆర్ట్స్ కళాశాల, ఐదేళ్ళ ఇంటిగ్రేటెడ్ కోర్సుల విద్యార్థులున్నారని పేర్కొన్నారు. ఎంపికైన విద్యార్థులకు నెలకు రూ. 15 వేల పారితోషికం చెల్లిస్తారని వివరించారు.

కేయూలో బాధ్యతలు చేపట్టిన అధికారులు

కేయూ క్యాంపస్, జూలై 16 : కాకతీయ యూనివర్సిటీ అదనపు పరీక్షల నియం త్రణాధికారి డాక్టర్ బి.నాగరాజు ఇప్పటి వరకు అదనపు పరీక్షల నియంత్రణా ధికారిగా పనిచేసిన డాక్టర్ చాడ రాధికారెడ్డి నుంచి బాధ్యతలను మంగళవారం స్వీకరించారు. అలాగే కాకతీయ యూనివర్సిటీ కో-ఎడ్యుకేషన్ ఇంజనీరింగ్ కళాశాల మెకానికల్, సివిల్ ఇంజనీరింగ్ విభాగాధిపతిగా రాధికా రెడ్డి బాధ్యతలు చేపట్టారు. కొత్తగూడెం ఇంజనీరింగ్ కళాశాలలో పనిచేస్తున్న కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజ నీరింగ్ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎన్. రమణ,, ఎలక్ట్రానిక్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ కె. బిక్షాలు, ఎలక్ట్రానిక్స్ ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ టి . జగన్మోహన్‌రాజులు ఆయా విభాగాల అధిపతు లుగా పదవీ బాధ్యతలు చేపట్టారు.

విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలి

కేయూక్యాంపస్, జూలై 16 : కాకతీయ యూనివర్సిటీ ఫార్మసీ కళాశాల విద్యా ర్థులు ఉన్నత శిఖరాలను ఆధిరోహించాలని, వర్సిటీ ప్రతిష్టను పెంచాలని ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ నీరటి ప్రసాద్ పిలుపునిచ్చారు. మంగళవారం బీఫా ర్మసీ చివరి ఏడాది విద్యార్థుల వీడ్కోలు సమావేశం కేయూ ఫార్మసీ కళాశాలలో జరిగింది. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ప్రసాద్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. కేయూ ఫార్మసీ కళాశాల ప్రతిష్ఠ ఖండాం తరాలకు వ్యాపించిందన్నారు. ప్రపంచ వ్యాప్తంగా ప్రముఖ సంస్థల్లో మన కళాశాల విద్యార్థులు ప్రధాన భూమిక వహిస్తున్నా రని కొనియాడారు. కేయూ పీఆర్వో డాక్టర్ వల్లాల పృథ్వీరాజ్ ప్రాం గణ నియామకాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. మెలకువలను నేర్పిం చారు.

వాహనాలు లోపల.. అర్జీదారులు బయట

ఐనవోలు, జూలై 16: ఐనవోలు తహసీల్దార్ కార్యాలయంలో వాహనాల పార్కింగ్‌తో అర్జిదారులు కూర్చోవడం కాదు కదా నిల్చోవడానికి స్థలం లేకుండా పోతోంది. వివిధ గ్రామాల నుంచి పనుల కోసం కార్యాలయానికి వచ్చే అర్జిదారులు కుర్చోవడానికి కుర్చీలు లేక నిలబడటానికి స్థలంలేక ఇబ్బందులు పడుతుంటే సందేట్లో సడేమియాల ఉద్యోగులు సిబ్బంది తమ ద్విచక్రవాహనా లను ఏకంగా బిల్డింగ్ ఆవరణలో పార్కింగ్ చేస్తున్నారు. దీంతో భవనం లోపల ఉండాల్సిన అర్జిదారులు ఆరు బయట నిల్చుంటున్నారు. ఆరు బయట ఉండా ల్సిన వాహనాలు భవనంలో లోపల ఉండడం గమనార్హం. తహసీల్దార్ చొరవ తీసుకొని కార్యాలయానికి వచ్చే అర్జిదారుల కోసం బెంచీలు వేయించి వాహ నాల పార్కింగ్‌ను భవనం బయట ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

సకల శుభాలు కలిగించే తొలి ఏకాదశి



నేడు ఆలయాల్లో ప్రత్యేక పూజలు

హనుమకొండ కల్చరల్/వరంగల్ కల్చరల్, జూలై 16 : హిందూ సంప్రదాయంలో అత్యంత ప్రాముఖ్యమున్న తొలి ఏకాదశి పర్వాన్ని బుధవారం భక్తి శ్రద్ధలతో ఆచరించు కునేందుకు జిల్లా ప్రజలు సమాయత్తమ య్యారు. ఆషాఢమాసంలో శుక్లపక్షాన వచ్చే ఏకాదశి నుంచే దక్షిణాయపర్వం ప్రారంభం కానుంది. గుమ్మాలకు తోరణాలు కట్టి ఇష్ట దైవాలైన వేంకటేశ్వరస్వామి, క్షీర సముద్రంలో లక్ష్మీ సమేతుడై ఉన్న శ్రీమన్నారాయణుడిని కొలవడడంతో పాటు ఉపవాసం ఉంటే అన్ని కార్యాలు నెరవేరుతాయన్నది విశ్వాసం. మహా సాధ్వి సతి సక్కుబాయి ఈ వ్రతాన్ని ఆచరించే మోక్షసిద్ధి పొందిందని, దీంతో పాటు మౌనం ఉండటం ఉదయాన్నే విష్ణు సహస్ర నామ పారాయణం వినడం, ఉదయం విష్ణు ఆలయాన్ని ప్రదోశకాల సమయంలో శివాలయాలను సందర్శించడం, సందర్శించిన వారికి మంచి ఫలితాలు ఉంటాయన్నది ఈ ఏకాదశి పర్వదిన విశేషం. విష్ణుమూర్తి పాల కడలి యోగా నిద్రలోకి వెళ్లే సందర్భాన్ని సయన ఏకాదశి అని కూడా పిలవడం ఆనవాయితీ. వేంకటేశ్వరస్వామికి ఎర్రని పూలతో, తులసీ దళాలతో పూజలు చేస్తే సత్ఫలితాలు ఉంటాయని నమ్మకం.

పూలకు భలే గిరాకీ..

తొలి ఏకాదశి సందర్భంగా ఆలయాల్లో అలంకరణలు, ప్రత్యేక పూజలతో పాటు ప్రజలు ఇళ్లల్లో కూడా పండుగ వేడుకలను నిర్వహించుకుంటారు. ఈ క్రమంలో పూలకు గిరాకీ పెరిగింది. మంగళవారం కిలో మల్లెపూలు రూ.వేయి పలుకగా, చామంతులు కిలో రూ. 400, గులాబీలు కిలోకు రూ.300 పలికాయి. వర్షాల నేపథ్యంలో పూలు కూడా తక్కువగా వచ్చినా.. అధిక ధరలున్నా పండుగ కోసం పూలను కొనుగోలు చేశారు.

ముస్తాబైన ఆలయాలు..

ఏకాదశి పర్వదిన ప్రత్యేక పూజల కోసం ఆలయాల్లో ఏర్పాట్లు పూర్తి చేశారు. వేయిస్తంభాల ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకులు గంగు ఉపేంద్ర శర్మ తెలిపారు. అలాగే వరంగల్ భద్ర కాళి అమ్మవారి ఆలయం, బట్టల బజార్‌లోని బాలానగర్ వేంకటేశ్వర ఆలయం, జేపీఎన్ రోడ్డు గీతా భవన్ కృష్ణ మందిరం, వేంకటేశ్వరాలయం, కాశిబుగ్గ శ్రీరంగనాథ స్వామి దేవాలయం, డాక్టర్స్ కాలనీ వేంకటేశ్వర స్వామి ఆలయం, ఆకారపు వారి గుడి లక్ష్మీనర్సింహస్వామి దేవాలయం, ఇస్కాన్ శ్రీకృష్ణ మందిరం, పోతన రోడ్డు మురళీకృష్ణ మందిరంతో పాటు నర్సంపేటలోని వేంకటేశ్వరస్వామి, దుగ్గొండిలోని వేంకటేశ్వరాలయం, కొమ్మాల లక్ష్మీనర్సింహస్వామి, రాయపర్తి సన్నూరులోని వేంకటేశ్వర ఆలయాల్లో అభిషేకాలు, అలంకరణలకు ఏర్పాట్లు చేశారు. కరీమాబాద్ ప్రాంతంలోని బీరన్న దేవాలయంలో బోనాల పండుగను నిర్వహిస్తారు. ఆషాఢ శుద్ధ ఏకాదశి, ముక్కోటి ఏకాదశి, వైకుంఠ ఏకాదశి పర్వదినాల రోజున ఎలాంటి ఆహారం భుజించకుండా ఉపవాస దీక్ష చేస్తే భగవత్ అనుగ్రహం కలుగుతుందని నమ్మకం. ఇక కొన్ని సామాజిక వర్గాలకు చెందిన వారు ఈ ఏకాదశిని పెద్ద ఏకాదశి అని పిలుస్తారని, పిండి వంటలతో మాంసాన్ని కూడా భుజిస్తారట. సంప్రదాయ బద్ధంగా పెద్ద ఏకాదశి పండుగ రోజున కంచంలో బొక్కను కొట్టే ఆచారాన్ని పాటిస్తారట.

సమధర్మం, త్యాగానికి ప్రతీక మొహర్రం

నేడు పీర్ల పండుగ



జఫర్‌గడ్ మండలం తిమ్మాపూర్‌లో పీరీలను ఊరేగిస్తున్న దృశ్యం

జఫర్‌గడ్, జూలై 16 : సుమారు 14 శతాబ్దాల క్రితం ప్రజాస్వామ్యం, మానవ హక్కుల పరిరక్షణ కోసం జరిగిన చరిత్రాత్మక పోరాటమే మొహర్రం. హిజ్రీ క్యాలండర్ ప్రకారం నూతన సంవత్సర ఆరంభ మాసమే మొహర్రం. ఈ నెల ఆరంభం నుంచి ఇస్లాం కొత్త సంవత్సరం ప్రారంభమవుతుంది. శాంతి, సమధర్మం, మానవత్వానికి ప్రాణం పోసిన ధీరుడు, మహ్మద్ ప్రవక్త మనవడు ఇమామ్ హుస్సేన్. ప్రేమ మూర్తిగా, ధర్మశాస్త్ర ప్రావీణ్యుడిగా ప్రజలను కాపాడేందుకు అత్యంత ధైర్య సాహసాలతో తన తోటి వారిని ముందుకు నడిపి ప్రశంసలందుకున్నారని ప్రతీతి. ప్రవక్త తెచ్చిన ఇస్లాం ధర్మాన్ని నిర్వీర్యం చేస్తున్న ఇరాక్ రాజు యజీద్ తనకు మద్దతు ఇవ్వాలని ఇమామ్ హుస్సేన్‌ను కోరగా, తాను ప్రజాస్వామ్య పాలన కోసం ప్రజల వైపే నిలబడతానన్నారని, ఇమామ్ హుస్సేన్ తన పరివారంతో కలిసి కుఫాకు బయలుదేరుతున్న విషయాన్ని తెలుసుకున్న యజీద్.. తన సైన్యాన్ని పంపించి ఇరాక్ సమీప ప్రాంతంలోని కర్బలా మైదానంలో అడ్డుకుని పది రోజుల పాటు యుద్ధం సాగించాడని చెబుతుంటారు. ఇందులో ఇమామ్ హుస్సేన్ బంధువర్గం 72 మంది వీరోచితంగా పోరాటం చేసి మరణించారు. పదో రోజు ఒక్కడిగా మిగిలిన హుస్సేన్ శత్రువుల అనుమతితో ప్రార్థన చేస్తున్న సమయంలో వెన్నుపోటు పొడిచి సంహరించడంతో వీర మరణం పొందాడు. ఈ ఘట్టాన్ని స్మరిస్తూ ఏటా సంప్రదాయబద్ధంగా మొహర్రం నిర్వహిస్తున్నారు. ఇమామ్ హుస్సేన్ వీర మరణానికి నిదర్శనంగా చావిడిలో పీర్లను తయారు చేసి ఉంచి 9 రోజుల పాటు పూజిస్తారు. చదివింపులు, పూజలను కుల మతాలకతీతంగా నిర్వహిస్తారు. 10వ రోజున తెల్లవారు జామున అగ్నిగుండంలోకి పీర్లు ప్రవేశించి ఊరంతా గ్రామోత్సవం పేరుతో ఊరేగిస్తారు. ప్రాణత్యాగం చేసిన ఉదంతాన్ని షహదత్‌గా (మొహర్రం)గా జరుపుతారు.

నేడు పీర్ల ఊరేగింపులు..

మొహర్రం సందర్భంగా నూతన వస్త్రాలతో అందంగా ముస్తాబు చేసిన పీర్లను బుధవారం జిల్లాలోని ఆయా ప్రాంతాల్లో ఊరేగిస్తారు. అసయ్ దులా.. అంటూ డప్పు చప్పుళ్లతో వీధుల్లో.. ఇంటింటికీ తిరుగుతారు. ప్రజలు భక్తితో పీర్లకు పూజలు నిర్వహించి ఆశీర్వాదం తీసుకుని భక్తితో కానుకలను సమర్పిస్తారు. పీర్ల ఊరేగింపు సందర్భంగా గ్రామాల్లో సందడి వాతావరణం నెలకొంటుంది. మధ్యాహ్నం చావడి వద్దకు, సాయంత్రం వేళల్లో గ్రామ చివర పొలిమేర్లకు హిందూ - ముస్లింలు కలిసి పాటలు పాడుకుంటూ నృత్యాలు చేస్తూ పీర్లను శోభా యాత్రగా తీసుకువెళతారు.

ఆలిండియా పారా అథ్లెటిక్స్‌లో

జిల్లా క్రీడాకారుడికి స్వర్ణం




1500 మీటర్ల పరుగులో అకీరానందన్ సత్తా

వరంగల్ స్పోర్ట్స్, జూలై16: పారా అథ్లెటిక్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో బెంగళూరులో నిర్వహిస్తున్న ఆలిండియా పారా అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీల్లో హనుమకొండకు చెందిన అకిరానందన్ సత్తా చాటి స్వర్ణ పతకం సాధించాడు. అండర్ 19 బాలురు 1500 మీటర్ల పరుగు పందెంలో రాణించిన అకీరానందన్ ప్రథమ స్థానంలో నిలిచాడు. హనుమకొండ జేఎన్ఎస్ లోని సింథటిక్‌ట్రాక్‌లో కోచ్ సారంగపాణి వద్ద శిక్షణ పొందుతున్నాడు. ఆలిండియా పారా అథ్లెటిక్స్‌లో స్వర్ణపతకం సాధించిన అకీరానందన్ జిల్లా కీర్తి ప్రతిష్ఠలను విశ్వవ్యాప్తం చేశాడని అథ్లెటిక్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సారంగపాణి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే హనుమకొండ జిల్లా డీవైఎస్‌వో గుగులోత్ అశోక్‌కుమార్, జిల్లా, రాష్ట్ర పారా అథ్లెటిక్స్ అసోసియేషన్ బాధ్యులు, సీనియర్ క్రీడాకారులు అకిరానందన్‌ను అభినందించారు.

రుణమాఫీతో ఉమ్మడి జిల్లాలో

78,432 రైతులకు లబ్ధి




హనుమకొండ సిటీ , జూలై 16 : రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన రుణమాఫీ పథకం ద్వారా ఉమ్మడి వరంగల్ జిల్లా డీసీసీ బ్యాంకు పరిధిలో 78,432 మంది రైతులకు లబ్ధి చేకూరనుంది. డీసీసీ బ్యాంకు పరిధిలోని బ్రాంచిలు, సహకార సంఘాల నుంచి రుణాలు పొందిన రైతులకు ఆర్థిక ప్రయోజనం చేకూరనుంది. అయితే రాష్ట్ర ప్రభుత్వం తొలుత రూ. 2 లక్షల రుణమాఫీ ఏక కాలంలో చేయనున్నట్లు ప్రకటించింది. కానీ ప్రస్తుతం 18వ తేదీన లక్ష రుణ మాఫీ అని ప్రకటించడంతో కాస్త అయోమయం నెలకొంది. అయితే మరో లక్ష రుపాయల రుణం అంటే మొత్తంగా 2 లక్షల రూపాయల రుణ మాఫీ వివరాలు ముున్ముందు వెల్లడి కావచ్చని బ్యాంకు అధికారులు అంటున్నారు. ఇప్పటికే టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు డీసీసీ బ్యాంకు పరిధిలోని 78,432 రైతుల రుణమాఫీకి సంబంధించిన వివరాలను అందచేశారు. 18వ తేదీన రుణమాఫీకి సంబంధించిన లక్ష రూపాయలు రైతుల ఖాతాల్లో జమ కానున్నట్లు ప్రభుత్వం ప్రకటించడం ఈ సందర్భాన్ని పురస్కరించుకొని రైతు వేదికల్లో రుణమాఫీ లబ్దిదారులతో సంబురాలు ఉండడంతో అధికారగణం సిద్ధమవుతోంది.

ప్రముఖ ఉర్దూ కవి తాజ్‌ముక్తార్

కన్నుమూత

పలువురి సంతాపం



తాజ్ ముక్తార్ (ఫైల్)

హనుమకొండ కల్చరల్, జూలై 16 : సుప్రసిద్ధ ఉర్దూ కవి కాళోజీ సోదరులకు అత్యంత ఆప్తుడు అయిన హనుమకొండకు చెందిన తాజ్ ముక్తార్ (88) మంగళవారం రాత్రి హైదరాబాద్‌లో మృతి చెందడంపై కాళోజీ ఫౌండేషన్, మిత్ర మండలి వరంగల్ రచయితల సంఘం సంతాపం వ్యక్తం చేసింది. కాళోజీ ఫౌండేషన్ అధ్యక్షులు రామశాస్త్రి, కార్యదర్శి వి.ఆర్.విద్యార్థి మాట్లాడుతూ.. ఆదర్శ భావాలుగల కవి, కుల మతాలకు అతీతంగా గొప్ప కవిత్వాన్ని సృజించారని ఆయన మృతి ఉర్దూ సాహిత్యానికి తీరని లోటని, ఓరుగల్లు సాహితి ప్రపంచంలో ఆయన లోటు ఎవరూ భర్తీ చేయలేనిదని పేర్కొన్నారు. ప్రముఖ నవలాకారుడు అంపశయ్య నవీన్, కేయూ తెలుగు విశ్రాంత ఆచార్యులు బన్న ఐలయ్య, పొట్లపల్లి శ్రీనివాసరావు, అనిశెట్టి రజిత, మహ్మద్ సిరాజుద్దీన్, డాక్టర్ అగపాటి రాజ్‌కుమార్, తెలంగాణ రచయితల సంఘం పక్షాన బిల్లా మహేందర్, నెల్లుట్ల రమాదేవి, కార్తీకరాజు, బాలబోయిన రమాదేవి, గట్టు రాధిక, వల్సపైడి తదితరులు కూడా వేర్వేరుగా సంతాపం వ్యక్తం చేశారు.

ఫోర్త్ బెటాలియన్ కమాండెంట్‌గా రామ్‌ప్రకాశ్



శంభునిపేట, జూలై16: మామునూరులోని టీఎస్ఎస్పీ ఫోర్త్ బెటాలియన్ కమాండెంట్‌గా బి.రామ్‌ప్రకాశ్ నియమితులయ్యారు. మంగళవారం ఆయన పదవీ బాధ్యతలు స్వీకరించారు. డిచ్‌పల్లి 7వ బెటాలియన్ కమాండెంట్‌గా పనిచేస్తున్న రామ్ ప్రకాశ్‌ను ఇటీవల డీజీపీ కార్యాలయానికి అటాచ్ చేశారు. కాగా వరంగల్‌లోని మామునూరులోని 4వ బెటాలియన్‌కు పూర్తిస్థాయిలో బాధ్యతలు అప్పగిస్తూ పోలీసు శాఖ రామ్‌ప్రసాద్‌ను బదిలీ చేసింది. అయితే ప్రస్తుతం భద్రాద్రి కొత్తగూడెం 5వ బెటాలియాన్ కమాండెంట్ డాక్టర్ శివప్రసాద్‌రెడ్డి 4వ బెటాలియన్ కమాండెంట్‌గా అదనపు బాధ్యతలు నిర్వర్తిస్తుండగా మంగళవారం ఆయన నుంచి రామ్‌ప్రకాశ్ బాధ్యతలు స్వీకరించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమాండెంట్‌లు కృష్ణప్రసాద్, శ్రీనివాస్, ఏఓ నిర్మల, యూనిట్ వైద్యురాలు అన్వేషిణి, ఆర్‌ఐలు శోభన్, పురుషోత్తం రెడ్డి, వెంకటేశ్వర్లు, రాజిరెడ్డి, రమేష్, ఏవీఎన్ రెడ్డి, రాజ్‌కుమార్, కిరణ్, అశోక్, కృష్ణ ఉన్నారు.

'పదహారుచింతల్ తండా' కుటుంబానికి కేటీఆర్ అండ



బాధిత అక్కాతమ్ముడిని పరామర్శిస్తున్న కేటీఆర్

చెన్నారావుపేట, జూలై 16: ఇటీవల వరంగల్ జిల్లా చెన్నారావుపేట మండలంలోని పదహారుచింతల్ తండాలో ప్రేమోన్మాది చేతిలో తల్లిదండ్రులను కోల్పోయి, గాయపడిన గిరిజన అన్నాచెల్లెలికి బీఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్వకుంట్ల తారకరామారావు అండగా నిలిచారు. మంగళవారం నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి ఆ ఇద్దరిని తీసుకొని హైదరాబాద్‌లో కేటీఆర్ నివాసంలో కలిశారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ ఈనెల 12న యువకుడు కత్తితో జరిపిన దాడిలో తల్లిదండ్రులను కోల్పోయి.. గాయపడిన ఇద్దరు పిల్లలకు అండగా ఉంటామని, వారి చదువుల కోసం ఖర్చులను భరిస్తామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం బాధితులకు రూ.50లక్షల సాయాన్ని అందించాలని డిమాండ్ చేశారు. నిందితుడు నాగరాజుకు కఠిన శిక్ష పడేలా డీజీపీకీ ఆదేశాలు ఇవ్వాలని కేటీఆర్ సీఎం రేవంత్‌రెడ్డిని కోరారు. బాధిత కుటుంబానికి తాము రూ.5లక్షల ఆర్థిక సాయాన్ని అందిస్తామన్నారు. కేటీఆర్‌ను కలిసిన వారిలో మాజీ జడ్పీ ఫ్లోర్ లీడర్ పెద్ది స్వప్న, మాజీ సర్పంచ్ బానోతు శారదగణేష్ తదితరులు పాల్గొన్నారు.

మక్కలు, పత్తికి రికార్డు ధర

ఏనుమాములలో క్వింటా మక్కలు రూ.2,725, పత్తి రూ. 7,350

మట్టెవాడ, జూలై 16: ఏనుమాముల వ్యవసాయ మార్కెట్‌లో మంగళవారం మొక్కజొన్న, పత్తికి రికార్డు ధర పలికింది. మొక్కజొన్న క్వింటాకు రూ.2,725 ధర, పత్తి క్వింటాకు రూ. 7,350 ధర పలికింది. మార్కెట్ చరిత్రలోనే మొక్కజొన్నలకు ఇంత ధర పలకడం ఇదే తొలిసారి. అంతర్జాతీయ మార్కెట్‌లో పత్తికి డిమాండ్ పెరగడంతో రూ. 7,350 చేరినట్లు వ్యాపారులు తెలిపారు.

మక్కలకు, పత్తికి ధర పెరగడంతో రైతులు హర్షం వ్యక్తం చేశారు. జూలైలో మొక్కజొన్నలు, పత్తి ధర మార్కెట్‌లో రోజు రోజుకు పెరుగుతుంది. దీంతో మార్కెట్‌లో క్రయ విక్రయాలు జోరుగా సాగుతున్నాయి.

లింక్ క్లిక్ చేశాడు.. రూ.96వేలు పోగొట్టుకున్నాడు..

స్టేషన్‌ఘన్‌పూర్, జూలై 16: జనగామ జిల్లాలో ఓ యువకుడు సైబర్ వలలో పడ్డాడు. వాట్సాప్‌లో వచ్చిన లింక్ క్లిక్ చేసి రూ.96వేలు పోగొట్టుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. స్టేషన్‌ఘన్‌పూర్ మండలం తాటికొండ గ్రామానికి చెందిన పోకల రాజేష్ అనే యువకుడి ఫోన్‌కు ఈ నెల 15వ తేదీన సైబర్ నేరగాళ్లు ఒక లింక్ పంపారు. వందకు రెండు వందలు, రెండు వందలకు నాలుగు వందలు డబ్బులు వస్తాయని అందులో ఆశచూపారు. దీంతో బాధితుడు ఆ లింక్‌ను క్లిక్ చేశాడు. అంతే.. క్షణాల్లోనే బ్యాంకు ఖాతాలోని రూ.96వేలు వారి ఖాతాకు ట్రాన్స్‌ఫర్ అయ్యాయి. దీంతో బాధితుడు లబోదిబోమంటూ మరుసటి రోజు మంగళవారం ఘన్‌పూర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సీఐ ముస్క రాజు కేసు దర్యాప్తు చేస్తున్నారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ డబ్బులు ఆశచూపుతూ వాట్సాప్‌లకు వచ్చే లింక్‌లను ఎవరూ క్లిక్ చేయవద్దని సూచించారు. సైబర్ వలలో చిక్కకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు.

గంజాయి కేసులో ఒడిస్సా వాసికి పదిన్నర ఏళ్ల జైలు



కేసముద్రంలో గంజాయి కేసులో అరెస్ట్ చూపుతున్న డీఎస్పీ సత్యనారాయణ (ఫైల్)

కేసముద్రం (మహబూబాబాద్ జిల్లా), జూలై 16 : గంజాయి రవాణా చేస్తూ పట్టుబడిన ఒరిస్సాకు చెందిన వ్యక్తికి పదిన్నరేళ్ల జైలు శిక్షను మహబూబాబాద్ జిల్లా జడ్జీ పి.చంద్రశేఖరప్రసాద్ విధించినట్లు కేసముద్రం ఎస్ఐ వంశీధర్ మంగళవారం తెలిపారు. గత ఏడాది అక్టోబర్, 16న కేసముద్రం స్టేషన్ గాంధీసెంటర్‌లో రూ.4 లక్షల విలువైన 16.29 కిలోల గంజాయిని ఒరిస్సా రాష్ట్రం గంజం జిల్లా పెరగడ గ్రామానికి చెందిన రంజిత్‌కుమార్ ప్రాధాన్ అనే వ్యక్తి తరలిస్తుండగా, అదేరోజు పెట్రోలింగ్ విధుల్లో ఉన్న ఎస్ఐ కోగిల తిరుపతి తనిఖీ చేసి పట్టుకున్నట్లు తెలిపారు. తహసీల్దార్ దామోదర్ పంచనామా నిర్వహించగా ఎస్ఐ తిరుపతి కేసు నమోదు చేసినట్లు తెలిపారు. అప్పటి డీఎస్పీ సత్యనారాయణ, రూరల్ సీఐ రమేష్ సమక్షంలో నిందితున్ని అరెస్ట్ చేసినట్లు తెలిపారు. ఈ కేసులో సాక్ష్యాధారాలను పరిశీలించిన జిల్లా జడ్జీ చంద్రశేఖర ప్రసాద్ నిందితునికి పది సంవత్సరాల ఆరునెలల కఠిన కారాగార శిక్షతోపాటు రూ.1లక్ష జరిమానా విధిస్తూ తీర్పునిచ్చినట్లు ఎస్ఐ వివరించారు. గంజాయి కేసులో నిందితునికి శిక్షపడేలా చేసిన పోలీసు అధికారులను, సిబ్బందిని జిల్లా ఎస్పీ సుధీర్‌రాంనాథ్ కేకన్ అభినందించినట్లు ఎస్ఐ తెలిపారు.

వరంగల్ కేఎంసీలో 'సూపర్' సేవలు దూరం

సమయానికి విధులకు రాని సూపర్‌స్పెషాలిటీ ఆసుపత్రి వైద్యులు

సేవల కోసం రోగుల పడిగాపులు



వైద్యుల కోసం పడిగాపులు కాస్తున్న రోగులు

వరంగల్ మెడికల్, జూలై 16 : వరంగల్ కాకతీయ మెడికల్ వైద్య కళాశాలలోని సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో సూపర్ సేవల కోసం రోగులు పడిగాపులు కాస్తున్నారు. వైద్యులు సమయం పాటించకపోవడంతో వైద్యం కోసం నిరీక్షించాల్సిన పరిస్థితి ఏర్పడింది. పేద రోగుల బాగోగులు చూడాల్సిన వైద్యులు వేళాపాళా లేకుండా విధులకు హాజరు కావడం ఇబ్బందిగా మారుతోంది. మంగళవారం ఉదయం అనేక విభాగాల్లో వైద్యులు రాకపోవడంతో గంటల తరబడి వార్డుల్లోనే నిలబడాల్సిన పరిస్థితి ఏర్పడింది. రోజూ 12 గంటల వరకు ఓపీ ఉంటుండగా.. డాక్టర్ల కోసం నిరీక్షించాల్సిందేనని రోగులు వాపోతున్నారు. కనీసం కూర్చునేందుకు కుర్చీలు కూడా లేకపోవడంతో వృద్ధులు, వికలాంగులు మరిన్ని ఇబ్బందులు పడుతున్నారని, ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో తమ గోడు పట్టించుకునే వారే లేరని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఆస్పత్రిలో రోస్టర్ విధానం ద్వారా సూపర్ సేవలు అందుతున్నాయి. మంగళవారం న్యూరో సర్జరీ, నెఫ్రాలజీ, యూరాలజీ, పీడియాట్రిక్ విభాగానికి వచ్చే రోగులను లోనికి తీసుకెళ్లేందుకు కనీసం స్ట్రెచర్లు కూడా అందుబాటులో లేవు.

డాక్టర్లు ఎప్పుడు వస్తారనే ప్రశ్నలకు సమాధానం చెప్పేవారు కూడా కనిపించడం లేదు. ఆస్పత్రి అడ్మినిస్ట్రేటర్ దగ్గరికి కొందరు వెళ్లగా ఎంజీఎంలో రోగులను చూసి ఇక్కడకు వస్తారని సమాధానం ఇస్తున్నారని రోగులు పేర్కొంటున్నారు. కేఎంసీ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి వైద్యులు సమయం పాటించే విధంగా కలెక్టర్ చర్యలు తీసుకోవాలని రోగులు, వారి బంధువులు కోరుతున్నారు.

హత్య కేసు నిందితుల లొంగుబాటు

పరారీలో ప్రధాన నిందితుడు



వర్ధన్నపేటలో మాట్లాడుతున్న జనగాం వెస్ట్‌జోన్ డీసీపీ రాజమహేంద్రనాయక్

వర్ధన్నపేట, జూలై 16: భూమి కొనుగోలు విషయంలో జరిగిన గొడవలో హత్య చేసిన ముగ్గురిని రిమాండ్‌కు తరలించినట్లు జనగామ వెస్ట్ జోన్ డీసీపీ రాజమహేంద్ర నాయక్ తెలిపారు. మంగళవారం వర్ధన్నపేట పోలీస్ స్టేషన్‌లో ముగ్గురి నిందితులను హాజరుపర్చారు. అనంతరం డీసీపీ హత్యకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. రాయపర్తి మండలం బురహాన్‌పల్లికి చెందిన సూదిళ్ల దేవేందర్, అదే గ్రామానికి చెందిన పల్లె మల్లేశంనకు భూమి కొనుగోలు విషయంలో గొడవలు జరుగుతున్నాయన్నారు. 2022లో పల్లె మల్లేశంపై హత్యాయత్నం చేసిన కేసులో దేవేందర్ అతని అనుచరులపై న్యాయస్థానంలో కేసు నడుస్తోందని తెలిపారు. ఈక్రమంలో దేవేందర్, మల్లేశంను భయభ్రాంతులకు గురిచేస్తుండటంతోపాటు హత్య చేయడానికి యత్నిస్తుండడాన్ని మల్లేశం గ్రహించాడు. ఈక్రమంలో ఈనెల 7న దేవేందర్ ఇంట్లో ఒంటరిగా ఉన్నాడని తెలుసుకున్న మల్లేశం, ఆయన కుమారుడు మురళి, బొందిళ్ల చెన్నారాయుడు, హర్షన్ గోవింద్‌తో కలిసి ఇంట్లోకి ప్రవేశించి సుత్తితో కొట్టి చంపారు. హత్యకేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న పల్లె మురళి పరారీలో ఉండగా మిగిలిన ముగ్గురు నిందితులు మంగళవారం పోలీస్ స్టేషన్‌లో లొంగిపోయారు. ప్రధాన నిందితుడు మురళి కోసం మూడు పోలీసు బృందాలు గాలిస్తున్నాయని డీసీపీ రాజమహేంద్రనాయక్ తెలిపారు. సమావేశంలో వర్ధన్నపేట ఏసీపీ అంబటి నర్సయ్య, సీఐ సూర్యప్రకాష్, ఎస్సై ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

పెనుగోలుకు డీఎంహెచ్‌వో

కాలినడకన వెళ్లి ఆదివాసీలకు వైద్యం అందించిన అప్పయ్య



పెనుగోలు గుట్టలు ఎక్కుతున్న డీఎంహెచ్‌వో అప్పయ్య

వాజేడు, జూలై 16: ములుగు డీఎంహెచ్‌వో అప్పయ్య ఎంతో శ్రమకోర్చి తన వృత్తిధర్మాన్ని నిర్వర్తించారు. వాజేడు మండల పరిధి తెలంగాణ-ఛత్తీస్‌గఢ్ సరిహద్దు దండకారణ్యంలో ఎలాంటి రవాణా సౌకర్యం లేని కుగ్రామానికి కాలినడకన వెళ్లి ఆదివాసీలకు వైద్యం చేశారు. మంగళవారం మధ్యాహ్నం వాజేడుకు వచ్చిన ఆయన సిబ్బందితో కలిసి గుమ్మడిదొడ్డి మీదుగా మూడు వాగులు, గుట్టలు దాటుకుంటూ సుమారు 17 కిలోమీటర్లు నడిచి పెనుగోలుకు వెళ్లారు. గుట్టలపై నివసిస్తున్న ఆదివాసీలకు వైద్య పరీక్షల నిమిత్తం బయల్దేరారు. మంగళవారం రాత్రి పెనుగోలులో బస చేసి బుధవారం ఆదివాసీలకు వైద్యపరీక్షలు, దోమ తెరలను పంపిణీ చేయనున్నారు. ఎనుగోలు గుట్టలకు డీఎంహెచ్‌వో వెళ్లడం ఇదే ప్రథమం. ఆయన వెంట వాజేడు వైద్యాధికారి మహేందర్, హెచ్ఏ చిన్నవెంకటేశ్వర్లు, ఇతర సిబ్బంది ఉన్నారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

ఏటూరునాగారం రూరల్ : ప్రైవేట్ ఆసుపత్రుల యాజమాన్యలు నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని డీఎంహెచ్‌వో అప్పయ్య హెచ్చరించారు. మండల కేంద్రంలోని పలు ప్రైవేట్ ఆసుపత్రులను ఆయన తనిఖీ చేశారు. క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ యాక్ట్‌లో పేర్కొన్న విధంగా ఆస్పత్రులను నడపాలని సూచించారు. పేషెంట్ కేస్ షీట్‌లో వ్యాధికి సంబంధించిన సమాచారాన్ని పొందుపరచాలని, అనుమతులున్న మేరకే బెడ్స్ స్థాయి ఉండాలన్నారు. ఆసత్రిర ఆవరణను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, రోగులకు ఇబ్బందులు కల్గకుండా ఏర్పాట్లు ఉండాలని తెలిపారు. మలేరియా, డెంగీ, టైఫాయిడ్ సంక్రమణ వ్యాధులకు సంబంధించిన రోగా నిర్ధారణ పరీక్షల్లో పాజిటివ్ వస్తే వెంటనే జిల్లా వైద్య ఆరోగ్య శాఖకు వివరాలను తెలియచేయాలన్నారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న ఆస్పత్రులకు నోటీసు జారీ చేశారు.

ప్రాణం తీసిన హైవే గుంత

ఒకరి మృతి, మరొకరికి గాయాలు

జాతీయ రహదారిపై బంధువుల ఆందోళన



శీనివాస్ (ఫైల్)

మరిపెడ (మహబూబాబాద్ జిల్లా), జూలై 16 : జాతీయ రహదారి 365పై ఏర్పడిన గుంత కారణంగా ఒకరి ప్రాణం పోగా, మరొకరికి తీవ్ర గాయాలైన ఘటన మంగళవారం రాత్రి మరిపెడలోని గంగా వైన్స్ సమీపంలో చోటు చేసుకుంది. మృతుడి బంధువులు, కుటుంబసభ్యులు ఘటనాస్థలి వద్ద ఆందోళన చేశారు. మరిపెడ పోలీసులు కేసు నమో దు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. పోలీసులు, కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం. వీరారం గ్రామానికి చెందిన తాళ్ల శ్రీను, ఆయన కుమారుడు రాకేశ్ ఖమ్మంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి వెళ్లి తిరిగి వస్తున్నారు. మరిపెడలోనిహైవేపై ఏర్పడిన గుంతలో వారి ద్విచక్రవాహనం పడడంతో వాహనం అదుపుతప్పి కిం దపడగా తండ్రి శ్రీను (45) అక్కడికి అక్కడే మృతి చెందగా, కుమారుడు రాకేశ్ తీవ్ర గాయాలయ్యాయి. విషయం తెలిసిన మృతుడి బంధువులు ఘటనాస్థలం వద్ద ఆందోళనకు దిగారు. బాధిత కుటుంబానికి ఎన్‌హెచ్ఏ అధికారులు న్యాయం చేయాలని నినదించారు. పోలీసులు ఆందోళనకారులకు నచ్చచెప్పి, శాంతింప చేశారు. వ్యవసాయం చేస్తూ జీవనం కొనసాగిస్తున్న శ్రీనుకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

చిరువ్యాపారి హత్య కేసులో ఒకరి అరెస్ట్

కేసముద్రం(మహబూబాబాద్ జిల్లా), జూలై16 : కేసముద్రం విలేజి పూలే సెంటర్ సమీపంలో ఈనెల 14న సాయంత్రం చోటు చేసుకున్న జిలుకర నాగరాజు హత్య కేసులో, ఇదే గ్రామానికి చెందిన వల్లందాసు నగేష్‌ను అరెస్ట్ చేసినట్లు మహబూబాబాద్ రూరల్ సీఐ సర్వయ్య తెలిపారు. స్థానికంగా తీవ్ర సంచలనం రేపిన కేసులో అరెస్ట్ వివరాలను కేసముద్రంలో రూరల్ సీఐ మంగళవారం వెల్లడించారు. పూలే సెంటర్ సమీపంలో చిన్నడబ్బా ఏర్పాటు చేసుకొని జీవనం సాగిస్తున్న వల్లందాసు నగేష్‌కు జిలుకర నాగరాజుతో కొంతకాలంగా వ్యక్తిగత కక్ష ఏర్పడింది. గతనెల రోజులుగా నాగరాజును హతమార్చాలని నగేష్ ప్రయ త్నాలు చేస్తూ అవకాశం కోసం ఎదురుచూస్తున్నాడు. నాగరాజు అనుమానంతో నగేష్‌తో జాగ్రత్తగా ఉంటు న్నాడు. ఈ క్రమంలో ఆదివారం నగేష్ భార్య అనారోగ్యంతో బంధువుల ఇంటికి వెళ్లింది. సాయంత్రం నాగరాజు డబ్బాదుకాణం వద్దకు నగేష్ మద్యం సేవించి, వచ్చాడు. ఇదే అదనుగా భావించిన నగేష్ తన డబ్బా దుకాణం వెనుకనే ఉన్న ఇంట్లోకి మద్యం తాగుదామని నాగరాజును పిలిచాడు. అప్పటికే నాగరాజు మద్యం సేవించి ఉండడంతో అనుమానం లేకుండా నగేష్ ఇంట్లోకి వెళ్లాడు. అక్కడ నాగరాజుకు మరికొంత మద్యాన్ని నగేష్ పోశాడు. నాగరాజు మద్యం బాగా సేవించిన అనంతరం నగేష్ వెంటనే నాగరాజు తలపై కర్రతో బలంగా కొట్టగా, ఆ దెబ్బకు నాగరాజు కిందపడిపోయాడు. ఆ తర్వాత కాలితో నాగరాజు మెడపై తొక్కడంతో ఊపిరి ఆడక నాగరాజు మృతి చెందాడు. ఆ వెంటనే నగేష్ అక్కడి నుంచి నేరుగా పోలీస్ స్టేషన్‌కు వెళ్లి లొంగిపోయాడు. మృతుడి తల్లి మంగమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకోగా, పూర్తి విచారణ అనంతరం ఆధారాలను సేకరించి నిందితున్ని కోర్టులో హాజరుపర్చి రిమాండ్‌కు పంపినట్లు రూరల్ సీఐ తెలిపారు.

అంతా జలమయం

కాటారం, జూలై 16: మండలంలో సోమవారం రాత్రి కురిసిన భారీ వర్షంతో లోతట్టు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. 60.6 మి.మీ వర్షపాతం నమోదవడంతో అంతా అతలాకుతలమైంది. చింతకాని జీపీ పరిధిలో చకినాల రాజయ్య, నిడిగొండ సత్యం అనే సన్నకారు రైతులకు చెందిన కూరగాయల పందిళ్లు(పండాల్స్) భారీవర్షాలతో నేలమట్టమయ్యాయి. ఒక్కో రైతు సుమారు రూ.2లక్షలకు పైగా ఖర్చు చేసి ఎకరం విస్తీర్ణంలో పందిరి వేసి బీర సాగు చేశారు. బీరకాయలు పడి మరో రెండు రోజుల్లో కోతకు వస్తున్న తరుణంలో పందిళ్లు నేలకూలడంతో తీవ్రనష్టం వాటిల్లిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. భారీ వర్షంతో గంగారం అలుగువాగు, బొర్రవాగు, బండల వాగు, మల్లారం వాగు, వర్జోని వాగు పొంగిపొర్లాయి. గోపాల్‌పూర్, రేగులగూడెం, గంగారం, దామెరకుంట, శంకరంపల్లి, మల్లారం, గంగపురి, గుండ్రాత్‌పల్లి గ్రామాల పరిధిలో భారీ వర్షానికి వాగులు ఉప్పొంగి లోతట్టు ప్రాంతాల్లోని పంటలు వరదనీటిలో మునిగాయి. వందలాది ఎకరాల్లో పత్తిపంట, వరినార్లు నీటమునిగి రైతులకు నష్టం వాటిల్లింది.


వరదనీటిలో మునిగిన వరి నార్లు


మత్తడి దుముకుతున్న గూడెపు చెరువు

ఘనంగా 'అమ్మ మాట.. అంగన్‌వాడీ బాట'


భూపాలపల్లిలో కిషోర బాలికలు, తల్లులు, పిల్లల ర్యాలీ

భూపాలపల్లిటౌన్, జూలై 16: అంగన్‌వాడీ కేంద్రాల్లో 'అమ్మమాట.. అంగన్‌వాడీ బాట' అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. పట్టణంలోని హనుమాన్‌నగర్-1 సెంటర్‌లో అంగన్‌వాడీ టీచర్ బండారి పుష్పలత ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఆయా శారద, తల్లులు, కిషోర బాలికలు, పిల్లలు తదితరులు పాల్గొన్నారు.

• ములుగు కలెక్టరేట్: ములుగు మండలంలోని బండారుపల్లి గ్రామంలో అమ్మమాట- అంగన్‌వాడీ బాట కార్యక్రమం జరిగింది. ఈసందర్భంగా అంగన్‌వాడీ టీచర్లు, విద్యార్థులు గ్రామంలోని వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. అంగన్‌వాడీ టీచర్లు వినోద, రాజ్యలక్ష్మి, కవిత, వీవో లీడర్లు, కిశోర బాలికలు, తల్లులు తదితరులు పాల్గొన్నారు.

• కాటారం: అమ్మమాట.. అంగన్‌వాడీ బాట కార్యక్రమంలో భాగంగా రేగులగూడెం జీపీ పరిధిలోని రేగులగూడెం, దేవరాంపల్లి, ఎస్సీ కాలనీ, గోపాల్‌పూర్ అంగన్‌వాడీ కేంద్రాల ఆధ్వర్యంలో ర్యాలీలు నిర్వహించారు. టీచర్లు కమలాదేవి, అన్నపూర్ణ, రోజా, దివ్య, ఆయాలు పాల్గొన్నారు.

• మొగుళ్లపల్లి: మండల వ్యాప్తంగా అంగన్‌వాడీ కేంద్రాల్లో అమ్మమాట-అంగన్‌వాడీ బాట కార్యక్రమాలు నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు రజిత, మాధవి, అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు పాల్గొన్నారు.

• మల్హర్: తాడిచర్ల, చిన్నతూండ్ల, మల్లారం గ్రామాల్లో ఐసీడీఎస్ సూపర్ వైజర్ సరస్వతి ఆధ్వర్యంలో అమ్మ మాట.. అంగన్‌వాడీ బాట కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా గ్రామాల్లో ర్యాలీ నిర్వహించారు. అలాగే వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటారు.

గంజాయి విక్రేతల అరెస్టు

వెంకటాపురం(నూగూరు), జూలై 16: మండలంలోని చొక్కాల గ్రామ సమీ పంలో గంజాయి విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులను పోలీసులు అరెస్టు చేశారు. మంగళవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సీఐ బండారి కుమార్ విలేకరుల సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు. చొక్కాల గ్రామ సమీపంలోని పాలెం ప్రాజెక్టుకు వెళ్లేదారిలో ఇద్దరు వ్యక్తులు గంజాయిని విక్రయించేందుకు ప్రయత్నిస్తున్నారనే సమాచారంతో సిబ్బందితో వెళ్లి దాడులు నిర్వహించినట్లు తె పారు. దీంతో ఇద్దరు వ్యక్తులు పోలీసులను చూసి పారిపోయేందుకు యత్నించగా అదుపులోకి తీసుకుని విచారించామని అన్నారు. తాము భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపాడు మండలం గాంధీనగర్ గ్రామానికి చెందిన లక్ష్మణ్, నరేష్‌ని పేర్కొన్నారని, సెంట్రింగ్ మేస్త్రీలుగా పనిచేస్తున్నట్లు తెలిపా రు. వారి వద్దనుంచి స్వాధీనం చేసుకున్న ఐదుకిలోల 97 గ్రాముల గంజాయి విలువ రూ.1,26,975 ఉంటుందని అన్నారు. సమావేశంలో ఎస్సై కొప్పుల తిరుపతిరావు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

సర్కారు బడిలో విద్యార్థినులే స్వీపర్లు

వెంకటాపురం(నూగూరు), జూలై 16: మం డలంలోని అంకన్నగూడెం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యా యులు సమయపాలన పాటించకపోవడమే కాకుండా చదువుకునే విద్యార్థినులతో చీపురు పట్టించి పాఠశాల ఆవరణను శుభ్రం చేయించిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మూడు రోజుల క్రితం సోషల్ మీడియాలో చక్కర్లు కొట్టడంతో చర్చనీయాంశమైంది. చేతితో కలం పట్టి చదివించాల్సిన విద్యార్థినులతో ఉపాధ్యా యులు చీపురు పట్టించి శుభ్రం చేయించడంపై పలువురు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. ఈవిషయమై ఉన్నతాధికారులు స్పందించి ఉపాధ్యాయులపై చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.


పాఠశాల ఆవరణలో చీపురుతో ఊడుస్తున్న విద్యార్థినులు

చికిత్స చేయకుండానే చేసినట్టు..

భూపాలపల్లి కలెక్టరేట్, జూలై 16: భూపాలపల్లి జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్యులు చికిత్స చేయకపోయినా చేశామని చెప్పుకుంటూ పేషెంట్‌ను డిశ్చార్జ్ చేశారనే ఆరోపణలు వస్తున్నాయి. బాధితురాలి కుమారుడు అరవింద్ తెలిపిన వివరాల మేరకు.. భూపాలపల్లి మండలం కొంపెల్లి గ్రామానికి చెందిన సాగి స్వరూప తీవ్ర గాయాలై ఈనెల 10న జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ మెడికల్ జనరల్ ఆస్పత్రిలో చేరింది. బాధితురాలు కోలుకుందని చెబుతూ డాక్టర్లు ఈనెల 14న డిశ్చార్జ్ చేశారు. కోలుకోక ఇబ్బంది పడుతుండగా ఆమెను హనుమకొండలోని ప్రైవేటు ఆస్పత్రికి కుటుంబసభ్యులు తరలించారు. అక్కడ స్కానింగ్ నిర్వహించగా నాలుగు పక్కటెముకలు విరిగి అంతర్భాంలో రక్తం కారి ఇన్‌ఫెక్షన్ అయినట్లు వైద్యులు నిర్ధారించారు. స్వరూప ఆరోగ్యం పట్ల నిర్లక్ష్యం చేసిన ప్రభుత్వ ఆస్పత్రి వైద్యులపై చర్యలు తీసుకోవాలని కుటుంబ సభ్యులు డిమాండ్ చేస్తున్నారు.

ప్రమాదపుటంచున ప్రయాణం


నిర్మాణంలో ఉన్న వంతెనపై దాటుతున్న ప్రయాణికులు

టేకుమట్ల, జూలై 16: టేకుమట్ల-రాఘవరెడ్డిపేట గ్రామాల మధ్య చలివాగుపై నిర్మాణంలో ఉన్న వంతెన వద్ద ప్రయాణికులు బిక్కుబిక్కుమంటున్నారు. గత సంవత్సరం భారీ వరద కారణంగా టేకుమట్ల-రాఘవరెడ్డిపేట గ్రామాల మధ్య వంతెనలోని కొంతభాగం కూలిపోయిన విషయం విదితమే. ప్రయాణికుల సౌకర్యార్థం వాగులో మట్టిరోడ్డును ఏర్పాటు చేయగా సోమవారం వరద దాటికి అది తెగిపో యింది. దీంతో ప్రయాణికులు వంతెన గర్డర్ల నిర్మాణా నికి ఏర్పాటు చేసిన ఇనుప రాడ్లపై దాటుతూ ప్రయాణం చేస్తున్నారు.

ఇనుప వంతెన ధ్వంసం చేసిన దుడంగులు

వంతెన కూలిన తర్వాత అప్పటి ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి ఇనుప వంతెన ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో ప్రస్తుత ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు కూలిపోయిన వంతెన నిర్మాణ పనులకు నిధులు మంజూరు చేసి మరమ్మతులు చేయిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఇనుప నిచ్చెనను పక్కకు వైదొలిగించారు. రెండు రోజుల క్రితం గుర్తు తెలియని వ్యక్తులు ఆ నిచ్చెనను యంత్రాల సహాయంతో ముక్కలు ముక్కలుగా కోసి ధ్వంసం చేశారు.

మేడారంలో వనమహోత్సవం

మేడారం, జులై 16: తాడ్వాయి మండలం మేడారంలో మంగళవారం మహోత్సవాన్ని నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శి సతీష్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరగ్గా ఇన్‌చార్జి డీపీవో శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.మేడారం దేవస్థానం కార్యనిర్వహణ అధికారి రాజేంద్రం, ఎంపీవో శ్రీధర్‌రావుతో కలిసి మొక్కలు నాటారు. అనంతరం తాడ్వాయి, నార్లాపూర్, కామారం, బయ్యక్కపేట, ఊరట్టం, వెంగళాపూర్, కాల్వపల్లి గ్రామ పంచాయతీల కార్యదర్శులు సతీష్, రాజశేఖర్, ధర్మేందర్, రాజేందర్, జ్ఞనేశ్వరి, నర్మద, రవి, సిబ్బంది, ఉపాధి హామీ టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు, విద్యార్థులు వెయ్యి మొక్కలు నాటారు.

నిధుల కేటాయింపుపై హర్షం

ములుగు కలెక్టరేట్, జూలై 16: ములుగు నియోజకవర్గ అభివృద్ధికి సీఎం రేవంత్‌రెడ్డి రూ.400 కోట్ల నిధులను మంజూరు చేయడంపై కాంగ్రెస్ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు వంగ రవియాదవ్ హర్షం వ్యక్తం చేశారు. ములుగులో పార్టీ మండల అధ్యక్షుడు ఎమ్డీ.చాంద్‌పాషా అధ్యక్షతన మంగళవారం జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో రవి యాదవ్ మాట్లాడారు. రూ.400 కోట్లతో ములుగు జిల్లాకేంద్రంలో మోడల్ బస్టాండ్ నిర్మాణం, అంతర్గత రోడ్లు, ఏటూరునాగారంలో బస్సుడిపో ఏర్పాటు, ప్రతి మండలంలో సంక్షేమ భవనాలు నిర్మితం కానుండటం శుభపరిణామన్నారు. ములుగు నియోజకవర్గ అభివృద్ధికి నిధులు కేటాయించడం పట్ల సీఎం రేవంత్‌రెడ్డితోపాటుమంత్రి ధనసరి సీతక్కకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశంలో కంబాల రవి, రవికుమార్, భరత్‌కుమార్, ఓంప్రకాష్, షకీల్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్లపై నీరు నిల్వ ఉండొద్దు : అదనపు కలెక్టర్

ములుగు కలెక్టరేట్, జూలై 16: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే సీజనల్ వ్యాధుల వ్యాప్తిని అరికట్టొచ్చని, పారిశుధ్య నిర్వహణను అత్యధిక ప్రాధాన్యతతో చేపట్టాలని, రోడ్లపై నీరు నిల్వ ఉండకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ పి.శ్రీజ అన్నారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశపుహాల్‌లో వివిధశాఖల అధికారులతో జరిగిన సమీక్ష సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ప్రతిరోజు రోడ్లను పూర్తిస్థాయిలో శుభ్రం చేయాలని, డ్రెయినేజీలను క్లీన్ చేయాలని, రోడ్లపై ప్లాస్టిక్ కనిపించకుండా చూడాలన్నారు. ప్రతిరోజు ఉదయం వార్డ్ అధికారులు, సానిటేషన్ సూపర్‌వైజర్లు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ పారిశుధ్య నిర్వహణ జరిగేలా పర్యవేక్షించాలన్నారు. పారిశుధ్య నిర్వహణలో అలసత్వం ప్రదర్శిస్తే సీజనల్ వ్యాధులు వ్యాప్తిచెందే అవకాశం ఉందని అన్నారు. జిల్లాలోని అన్ని గ్రామాల్లో ఫాగింగ్ రెగ్యులర్‌గా చేపట్టాలని, వర్షం పడిన తర్వాత నీరు నిల్వ ఉండకుండా చర్యలు చేపట్టాలని, దోమలు వృద్ధి చెందకుండా ఆయిల్‌బాల్స్ వేయాలన్నారు. గ్రామస్థాయిలో పంచాయతీ కార్యదర్శులు, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ టీచర్లను సమన్వయం చేసుకుని ప్రజలకు పారిశుధ్య ప్రాముఖ్యతపై అవగాహన కల్పించాలని సూచించారు. మండలాల పరిధిలో ఉన్న రెసిడెన్షియల్ పాఠశాలలు, కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాలు, సంక్షేమ హాస్టళ్లను నేరుగా తనిఖీ చేసి పరిసరాలను పరిశుభ్రం చేయాలని, నీరు నిల్వ ఉండకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించాలన్నారు. వంట చేసే ప్రాంతాల్లో పాటించాల్సిన జాగ్రత్తల గురించి వివరించాలని, ఫుడ్ పాయిజనింగ్, సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందకుండా చర్యలు తీసుకోవాలని మండల పంచాయతీ అధికారులను ఆదేశించారు. ప్రతి శుక్రవారం గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు క్షేత్రస్థాయిలో ఉదయం 7 గంటలకు పర్యటిస్తూ డ్రైడే నిర్వహించాలని అన్నారు. జిల్లాలో ప్లాస్టిక్, చెత్త అధికంగా ఉండడానికి వీలు లేదని, జిల్లాలో ఉన్న డ్రెయినేజీలను రెగ్యులర్‌గా శుభ్రం చేయాలని, సెగ్రిగేషన్ షెడ్‌లను పూర్తిస్థాయిలో వినియోగంలోకి తీసుకురావాలని పంచాయతీ కార్యద ర్శులకు సూచించారు. జిల్లాలో ఉన్న ట్రాక్టర్ ద్వారా ప్రతి ఇంటి చెత్త సేకరణ జరగాలన్నారు. ఈ సమావేశంలో ఏపీడీ వెంకటనారాయణ, ఎంపీడీవోలు, ఎంపీవోలు, పంచాయతీ కార్యదర్శులు, టెక్నికల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

ముదిరాజ్‌లను బీసీ-ఏలో చేర్చాలి


కాటారం తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న ముదిరాజ్ నేతలు

కాటారం, జూలై 16: అన్ని రంగాల్లో వెనుకబాటుకు గురైన ముదిరాజ్ కులాన్ని బీసీ-ఏ కేటగిరీలో చేర్చాలని ముదిరాజ్ మహాసభ జిల్లా అధ్యక్షుడు జోరిక సదయ్య కోరారు. మండలకేంద్రంలోని అంబేద్కర్ కూడలి నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ముదిరాజ్ కులస్థులు, సంఘం నాయకులు మంగళవారం ర్యాలీ నిర్వహించారు. తహసీల్దార్ నాగరాజుకు వినతిపత్రాన్ని అందించారు.. ఈ సందర్భంగా సదయ్య మాట్లాడుతూ కాంగ్రెస్ అభయహస్తంలో భాగంగా మేనిఫెస్టోలో హామీ ఇచ్చిన విధంగా ముదిరాజ్‌లను బీసీ-డీ నుంచి బీసీ-ఏ జాబితాలోకి చేర్చాలన్నారు. ముదిరాజ్‌ల అభివృద్ధి కోసం కోఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్‌ను ఏర్పాటు చేయాలన్నారు. చెరువులు, కుంటలు, మత్స్య సంపదపై ముదిరాజ్‌లు, గంగపుత్రులకు హక్కులుండేలా చట్టపరంగా ఆదేశాలివ్వాలని కోరారు. రూ. వెయ్యి కోట్ల నిధులతో తెలంగాణ మత్స్య అభివృద్ధి బోర్డును ఏర్పాటు చేసి 75 శాతం రాయితీతో సంక్షేమ పథకాలు అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ మహాసభ రాష్ట్ర కార్యదర్శి పల్లెబోయిన అశోక్, మండల అధ్యక్షుడు ఓలపు రాజబాపు, రాష్ట్ర కార్యదర్శి చింతల రమేష్, జిల్లా అధికార ప్రతినిధి నాయిని శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి రాజమొగిలి, ఉపాధ్యక్షుడు కిష్టస్వామి, నాయకులు జోడు శ్రీనివాస్, జోడు సత్యం, ఓలపు శ్రీనివాస్, రాజు, మనోహర్, మధునక్క, సరోజన, రాకేష్, సంతోష్, సుమన్, ప్రసాద్, రాజయ్య, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

● మల్హర్: ముదిరాజ్‌లను బీసీ-ఏ జాబితాలో చేర్చాలని ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అశోక్ ఆధ్వర్యంలో తహసీల్దార్ రవికుమార్‌కు వినతిప్రతం అందజేశారు.తాడిచర్లలో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ మహాసభ జిల్లా అధ్యక్షుడు జోరిక సదయ్య, ఉపాధ్యక్షుడు మొగిళి, జిల్లా సొసైటీ చైర్మన్ చిలుకల పాణి, జోడు శ్రీను, తిరుపతి, ఆకుల రాజయ్య, చంద్రయ్య, పర్వతాలు, లక్ష్మయ్య, కుంట సదానందం, సదానందం, చొప్పరి రాజు, కుంట భూమయ్య, ఆకుల రాజబాపు తదితరులు పాల్గొన్నారు.

● మహదేవపూర్ : ముదిరాజ్‌లను బీసీ-ఏలో జాబితాలో చేర్చాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ ముదిరాజ్ మహాసభ నాయకులు తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ రాష్ట్ర కార్యదర్శి అశోక్, ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు గడ్డం స్వామి, సదయ్య, రాజమౌళి, గడ్డం దుర్గయ్య, తిరుపతి, జాడి కట్టయ్య జోడు శ్రీనివాస్, రమేష్, సీనియర్ జర్నలిస్టు రేగుల భాస్కర్ పాల్గొన్నారు.

కోర్టు తీర్పుతో సింగరేణి అధికారులకు చెంపపెట్టు

ఏఐటీయూసీ బ్రాంచి కార్యదర్శి రమేష్

కాకతీయఖని, జూలై 16: ప్రైవేటు సెక్యూరిటీ కాంట్రాక్టర్ వేసిన పిటీషన్‌ను హైకోర్టు డిస్మిస్ చేసిందని, కోర్టు తీర్పు ఏరియా సింగరేణి అధికారులకు చెంపపెట్టని ఏఐటీయూసీ భూపాలపల్లి బ్రాంచి కార్యదర్శి మోటపలుకుల రమేష్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. భూపాలపల్లి ఏరియాలో ప్రైవేటు సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్న ఓ వ్యక్తి పర్చేజ్ డిపార్ట్‌మెంట్, సెక్యూరిటీ, ఈఅండ్ఎంలో పనిచేస్తున్న కొందరు అధికారుల అండదండలతో తప్పుడు ధ్రువీకరణ పత్రాలను సమర్పించి కాంట్రాక్ట్ పొందాడని ఆరోపించారు. ఈ విషయమై విజిలెన్స్ విచారణ జరిపించాలని సింగరేణి సీఎండీతోపాటు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశానని తెలిపారు. అలాగే లేబర్ అధికారులకు ఫిర్యాదు చేశానని పేర్కొన్నారు. దీంతో లేబర్ అధికారులు విచారణ చేపట్టి అతని కాంట్రాక్ట్‌ను రద్దు చేసిందని తెలిపారు. అలాగే సింగరేణి అధికారులు ఆర్జీ-2లోని సదరు కాంట్రాక్టర్ కాంట్రాక్టును తొలగించారని పేర్కొన్నారు. దీంతో సదరు కాంట్రాక్టర్ హైకోర్టులో రిట్ పిటీషన్ వేశాడని తెలిపారు. ఈ క్రమంలో హైకోర్టు మున్సిపల్ రికార్డులను, అసిస్టెంట్ లేబర్ అధికారి ఉత్తర్వులను, తనుచేసిన ఫిర్యాధును పరిగణనలోకి తీసుకుని ఆ కాంట్రాక్టర్ వేసిన రిట్ పిటీషను డిస్మిస్ చేసిందని తెలిపారు.

మినీ స్టేడియం స్థల పరిరక్షణకు చర్యలు

కాటారం, జూలై 16: మండల కేంద్రంలోని కాటారం రెవెన్యూ శివారు సర్వే నంబర్ 49లో మినీ స్టేడియం స్థలాన్ని పరిరక్షించడానికి అధికారులు చర్యలు చేపట్టారు. ఆ స్థలంలో తహసీల్దార్ నాగరాజు ఆదేశాల మేరకు ఆర్ఐ వెంకన్న, రెవెన్యూ సిబ్బంది మంగళవారం హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేశారు. ఆయకట్టు లేని తిమ్మన్నకుంట భూమిని మినీ స్టేడియం కోసం ప్రతిపాదించగా కొంత కబ్జాకు గురవుతున్న నేపథ్యంలో ఇటీవల కలెక్టర్ రాహుల్‌శర్మకు టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి అంగోత్ సుగుణ, చింతకాని మాజీ ఎంపీటీసీ విజయారెడ్డి ఫిర్యాదు చేసి స్టేడియం స్థలానికి ప్రహరీ ఏర్పాటు చేయాలని కోరారు. ఈ నేపథ్యంలో రెవెన్యూ అధికారులు మొదట హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేశారు.

జూనియర్ అసిస్టెంట్లకు కౌన్సెలింగ్

కాకతీయఖని, జూలై 16: జయశంకర్ భూపాలపల్లి జిల్లా అటవీశాఖలో పనిచేస్తున్న జూనియర్ అసిస్టెంట్స్, ఆఫీస్ సబార్డినెంట్లకు డీఎఫ్‌వో వసంత మంగళవారం కౌన్సెలింగ్ నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా 20 మంది జూనియర్ అసిస్టెంట్లు పనిచేస్తుండగా 40శాతంలో భాగంగా ఎనిమిది మందికి కౌన్సెలింగ్ నిర్వహించారు. అలాగే ఎనిమిది మంది ఆఫీస్ సబార్డినెంట్లుగా ముగ్గిరికి కౌన్సెలింగ్ నిర్వహించినట్లు అటవీశాఖ అధికారులు తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

చిట్యాల, జూలై 16: మండలంలోని కాల్వపల్లి శివారు మానేరువాగు నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను గిద్దెముత్తారం శివారులో భూపాలపల్లి ఆర్డీవో మంగీలాల్ మంగళవారం పట్టుకున్నారు. గిద్దెముత్తారం గ్రామానికి ట్రాక్టర్ యాజమాని మోరె శంకర్‌పై కేసు నమోదు చేశారు. తదుపరి చర్యలు తీసుకోవాలని స్థానిక తహసీల్దార్ ఖాజా మొయినొద్దీన్‌ను ఆదేశించారు. అనుమతుల్లేకుండా ఇసుక అక్రమ రవాణాకు పాల్పడితే చర్యలు తప్పవన్నారు.

వేలంపాటతో రామప్పకు 5.20 లక్షల ఆదాయం

వెంకటాపూర్(రామప్ప), జూలై 16: మండలంలోని పాలంపేట గ్రామంలో ఉన్న రామప్ప రామలింగేశ్వరస్వామి దేవాలయం ఆవరణలో ఏడాదిపాటు కొబ్బరికాయలు, పూజా సామగ్రి అమ్ముకునేందుకు మంగళవారం ఆలయ ఈవో బిల్ల శ్రీనివాస్ ఆధ్వర్యంలో అధికారులు వేలంపాట నిర్వహించారు. ఈసందర్భంగా జనగాం రమేష్ అనే వ్యక్తి రూ.5,20,500కు వేలాన్ని దక్కించుకున్నారు. అనంతరం ఈవో బిల్ల శ్రీనివాస్ మాట్లాడుతూ గత ఏడాది కొబ్బరికాయలు, పూజాసామగ్రికి రూ.4లక్షల31వేలు సమకూరగా ఈఏడాది రూ.5,20,500 సమకూరాయని తెలిపారు. ఈకార్యక్రమంలో దేవాదాయ శాఖ పరిశీలకులు డి. అనిల్‌కుమార్, అర్చకులు కె.హరీశ్‌శర్మ పాల్గొన్నారు.

మల్లూరులో వైద్య శిబిరం

మంగపేట, జూలై 16: మండలంలోని మల్లూరులో మంగపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి యమున ఆధ్వర్యంలో మంగళవారం వైద్య శిబిరాన్ని నిర్వహించారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు.

ఐటీడీఏ ఉద్యోగులకు...

ఏటూరునాగారం రూరల్: మండలకేంద్రంలోని ఐటీడీఏ కార్యాలయంలో ఏపీవో వసంతరావు, జిల్లా ఉప వైద్య, ఆరోగ్య శాఖాధికారి కోరం క్రాంతికుమార్ పర్యవేక్షణలో ఐటీడీఏ సమావేశ మందిరంలో ఉద్యోగులు, సిబ్బందికి వైద్యాధికారులతో వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్‌వో రాజ్‌కుమార్, మేనేజర్ శ్రీనివాస్, వైద్యాధికారులు సుజాత, మౌనిక, నరహరి, అనూష పాల్గొన్నారు.

మున్నూరుకాపు మండల అధ్యక్షుడిగా రాజ్‌కుమార్

మల్హర్, జూలై 16 : మున్నూరుకాపు సంఘం మండల అధ్యక్షుడిగా రాజ్‌కుమార్ నియమితులయ్యారు. ఈ మేరకు సంఘం రాష్ట్ర కన్వీనర్ చింతపండు మహేందర్ పటేల్ ఉత్తర్వులు జారీ చేశారు. తనపై నమ్మకంతో అధ్యక్ష పదవిని కట్టబెట్టిన రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజీవ్ పటేల్, రాష్ట్ర కన్వీనర్ చింతపండు మహేందర్‌కు రాజ్‌కుమార్ కృతజ్ఞతలు తెలిపారు.

పీహెచ్‌సీని తనిఖీ చేసిన డీఎంహెచ్‌వో

చిట్యాల, జూలై 16: మండలంలోని ఒడితల పీహెచ్‌సీని భూపాలపల్లి డీఎంహెచ్‌వో మధుసూదన్ మంగళవారం తనిఖీ చేశారు. ఆస్పత్రిలోని మందులు, వైద్య పరికరాలు, రికార్డులను పరిశీలించారు. ఈసందర్భంగా సిబ్బందితో సమావేశమై పలు అంశాలను సమీక్షించారు. గ్రామాల్లో తరచుగా హెల్త్ క్యాంపులు ఏర్పాటు చేయాలన్నారు. పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఈకార్యక్రమంలో ఆస్పత్రి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మౌనిక, హెచ్ఈ శౌరీలమ్మ, సిబ్బంది పాల్గొన్నారు.

హేమలచల క్షేత్రంలో భక్తిగీతాలాపన

మంగపేట, జూలై 16: మండలంలోని మల్లూరు హేమచల క్షేత్రంలో భక్తిగీతాలాపన కార్యక్రమం మంగళవారం జరిగింది. వరంగల్ జిల్లా దుగ్గొండి మండలం మదనపల్లి గ్రామానికి చెందిన మారెడు గోండు రాజేశ్వరి, శివాంజనేయ భజన మండలి బృందం సౌజన్యంతో శివప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించారు.

పెచ్చులూడిన తహసీల్ కార్యాలయ కప్పు

కృష్ణకాలనీ (భూపాలపల్లి), జూలై 16: భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం శ్లాబ్ పెచ్చులూడి మంగళవారం కిందపడిపోయాయి. ఆ సమయంలో కొద్ది దూరంలోనే విధులు నిర్వర్తిస్తున్న డిప్యూటీ తహసీల్దార్ అనిల్ కుమార్‌కు త్రుటిలో ప్రమాదం తప్పింది. గత రాత్రి కురిసిన వర్షం కారణంగా శ్లాబ్‌పై వర్షపు నీరు చేరి ఉన్నట్లు తెలిసింది. దీంతో ఒక్కసారిగా పెచ్చులూడి పడటంతో డీటీ సహా మరో ఉద్యోగి భీతిల్లిపోయారు. ఎలాంటి ప్రమాదం చోటు చేసుకోకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

మొరం అక్రమ తరలింపుపై అధికారులకు రైతుల ఫిర్యాలు

మేడారం, జులై 16 : తాడ్వాయి మండలం నార్లాపూర్ గ్రామం శివారులోని తక్కెళ్లపాడు చెరువు కట్ట కింద కొందరు కాంట్రాక్టర్లు అక్రమంగా మొరం తరలిస్తున్నారని రైతులు మంగళవారం ఆందోళనకు దిగారు. తహసీల్దార్ రవీందర్, ఇరిగేషన్ ఏఈ అరవింద్, స్థానిక అధికారులకు ఫిర్యాదు చేశారు. చెరువు కట్ట కింద భాగంలో 30 మీటర్ల వరకు ఎలాంటి మట్టి తవ్వకాలు జరగకూడదని గతంలో అధికారులు హెచ్చరించినప్పటికీ పట్టించుకోకుండా యథావిధిగా చెరువు శిఖం భూమిలో మొరం తవ్వుతున్నారని అన్నారు. దీంతో చెరువు కట్టకు ప్రమాదం పొంచి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు చల్లగొండ కృష్ణారెడ్డి, జాటోత్ యాకూబ్, ధరావత్ దేవ్‌సింగ్, నూనవత్ కోటి, ఎడవెల్లి యాకూబ్‌రెడ్డి, కె.యాకయ్య, వినోద్, వీరయ్య, రవి పాల్గొన్నారు.